సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు 7



ముగ్గుల పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన టి.ఆద్రిశ్రీ, ద్వితీయ స్థానంలో నిలిచిన కె.ప్రత్యూష, తృతీయ స్థానంలో నిలిచిన బి.మణిలను అభినందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా, మగువ ట్రెండింగ్ డిజైన్స్ అధినేత ఉండవల్లి అనూష, ఆర్ఎస్ షాపింగ్‌మాల్ ప్రతినిధి సుబ్బారావు, ఏలూరు సాయిస్వర్ణ మోటార్స్ జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వరరావు, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి రాజు

సప్త వర్ణ శోభితం

ఏలూరులో ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

ఏలూరులో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక కేపీడీటీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. - వివరాలు నవ్యలో..

నేడు ఉండిలో మంత్రి నారా లోకేశ్ పర్యటన



అభివృద్ధి పనుల ప్రారంభం.. ఏర్పాట్లు చేసిన జిల్లా అధికారులు

భీమవరం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ సోమవారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్య టిస్తారు. ఉండి, కాళ్ళ, భీమవరం ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొంటారు.

ఏర్పాట్ల పరిశీలన

ఉండి, జనవరి5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ పర్యటనలో ఎక్కడ ఎటువంటి పొరపాట్లు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టరు టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. ఉండిలో మంత్రి లోకేశ్ పర్య టించే ప్రాంతాలను జేసీ ఆదివారం పరిశీలించారు. మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారం భించనున్న సీసీ రహదారి, పూర్వపు పాఠశాల భవనం, క్రీడాసౌకర్యాలు నిమిత్తం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను పరిశీలించి సూచ నలు అందించారు. గ్రామంలో రహదారుల పక్కన చెత్తచెదారం లేకుండా శానిటేషన్ చేసి బ్లీచింగ్ చల్లే విధంగా తగిన చర్యలు తీసుకో వాలని అధికారులకు సూచించారు. మంత్రి లోకేశ్ పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని ఎస్పీ నయీం అద్నాన్ అస్మి తెలిపారు. ఆదివారం ఆయన డీఎస్పీ జయసూర్య, తహసీల్దారు నాగార్జునలతో కలిసి మంత్రి పర్యటించే ప్రాంతాలు పరిశీలించారు. అధికారులు, ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కాగా ప్రారంభోత్సవ శిలాఫలకాలను సుందరంగా తీర్చిదిద్దారు.

మంత్రి లోకేశ్ పర్యటన ఇలా...

ఉదయం 7.30 గంటలకు: ఉండవల్లిలోని తమ నివాసం నుంచి రోడ్డు మార్గంలో పయనం
10 గంటలకు: రోడ్డు మార్గంలో ఉండి జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణానికి చేరిక
ఉదయం 10.00 నుంచి 10.45 గంటల వరకు: పునర్నిర్మించిన 108 ఏళ్ల పాఠశాలకు భవనం ప్రారంభం
ఉదయం 11-00 గంటలకు: రోడ్డు మార్గంలో కాళ్ల మండలం పెద అమిరం చేరిక
ఉదయం 11.00 -11.40 గంటల వరకు: దివంగత రతన్‌టాటా విగ్రహం ఆవిష్కరణ
ఉదయం 11.45: చినఅమిరంలోని ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరిక
ఉదయం 11.45-12.30: విద్యార్థులతో సమావేశానికి హాజరు
మధ్యాహ్నం 12.40-2.30 గంటల వరకు: డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు నివాసంలో కార్యకర్తలతో సమావేశం
మధ్యాహ్నం 2.45-4.00 : కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ నివాసం సందర్శన
సాయంత్రం 4.00: ఉండవల్లికి రోడ్డు మార్గంలో తిరుగు ప్రయాణం



లోకేశ్ పర్యటించే ప్రాంతాలు పరిశీలిస్తున్న ఎస్పీ నయీం అద్నాన్ అస్మి, జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి

ఇంటి వద్దకే అన్ని సేవలు

మెప్మా మరియు హోం ట్రయాంగిల్ సంయుక్త ఆధ్వర్యంలో

సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం ఫేస్ - 1

(వడ్రంగి సేవలు, ప్లంబింగ్ సేవలు, విద్యుత్ సేవలు, గృహోపకరణాలు రిపేరింగ్ సేవలు, బ్యూటీషియన్ సేవలు)

మీకు ఉన్న నైపుణ్యంతో మీ ఊరిలోనే సేవలు అందించి చక్కటి ఆదాయాన్ని పొందడానికి సదవకాశం

తణుకు మునిసిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

» యాప్ ద్వారా బుక్ చేసుకునే అవకాశం » నేటి నుంచి మునిసిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ
» మెకానిక్, కార్పెంటర్, పైప్‌లైన్ లీకేజీ తదితర మరమ్మతుల సేవలకు యాప్ ఏర్పాటు

భీమవరం టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇంటిలో ఏదైనా వస్తువు పాడైతే రిపేరు కోసం పరుగులు పెట్టాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఏసీ చెడిపోయినా, గీజర్ పాడైనా, కార్పెంటర్ పని పడినా, పైపులైన్‌ల లీకేజీలు ఉన్నా నగరాలు, పట్టణాల్లోని సాధారణ గృహస్థులు పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. ఎవరిని సంప్రదించాలో... మెకానిక్‌లు ఎక్కడుంటారో తెలియదు. తెలిసినా.. ఎలా చేస్తారో, ఎంత మొత్తం తీసుకుంటారోనన్న సందేహాలు. ఈ సమస్యలకు పరిష్కారం చూపుతూ మెప్మా అధికారులు కొత్త యాప్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. సర్వీస్ ప్రొవైడర్స్ నమోదు కార్యక్రమం పేరుతో పట్టణాలల్లో చేతి వృత్తుల వారి వివరాలను దరఖాస్తుల రూపంలో తీసుకుని వారిని యాప్ ద్వారా అనుసంధానంచేసి వారి ద్వారా ఇంటి వద్దకే సేవలు అందించాలన్నదే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం పెద్ద పట్టణాల్లో కొనసాగుతున్న ఈ విధానాన్ని ఇక నుంచి పట్టణాల్లో అందుబాటులోకి రానుంది. హైదరాబాద్‌కు చెందిన హోం ట్రయాంగిల్ సంస్థతో మెప్మా అధికారులు ఒప్పందం కుదుర్చుకున్నారు.

నేటి నుంచి అన్ని మునిసిపాలిటీల్లో దరఖాస్తుల స్వీకరణ

హోమ్ ట్రయాంగిల్ సిబ్బంది సోమవారం నుంచి ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 10 మునిసిపాలిటీ కార్యాలయాల్లో సోమవారం నుంచి మెప్మా అధికారులతో కలసి మేళా నిర్వహిస్తారు. ఆసక్తిగలవారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన వారికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తారు. తదుపరి ఫోన్ నంబర్లు, చిరునామాతో సహా యాప్‌లో పొందుపరుస్తారు. గుర్తింపు కార్డులు ఇస్తారు. వినియోగదారులతో ఎలా మెలగాలన్నది కూడా తెలియచేసి మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకువస్తారు. ఇందులో వడ్రంగులు, ప్లంబింగ్, విద్యుత్ ఉపకరణాలు, ఏసీ, వాషింగ్ మెషిన్, వాటర్ ప్యూరిఫయర్, గీజర్, బ్యూటీషియన్ తదితర సేవలందించే వారంతా ఇందులో ఉంటారు. ఈ మొత్తాన్ని పై హోం ట్రయాంగిల్ సంస్థకు అనుసంధానం చేస్తారు. సేవలు అవసరమైన వారు యాప్ ద్వారా బుక్ చేసుకుంటే సంబంధిత సిబ్బందిని పంపించే ఏర్పాటు చేస్తారు. అయ్యే ఛార్జీలను ముందుగానే తెలియజేస్తారు. అందరికీ ఆదాయం వచ్చేలాచేస్తారు. ఎంపికైన వారికి ప్రతి నెలా కనీసం రూ.15 వేలు ఆదాయం వచ్చేలా చూడాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆసక్తి కలిగిన మెకానిక్‌లు రేషన్ కార్డు, ఆధార్, బ్యాంకు పాస్ పుస్తకం, పాన్‌కార్డు జిరాక్స్ కాపీలతో వెంటనే మెప్మా కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది. అయితే భీమవరం, ఏలూరు కార్పొరేషన్‌లో రెండుమూడు రోజుల తరువాత మేళా జరుగుతుంది. మిగిలిన మునిసిపాలిటీల్లో సోమవారం నుంచి మేళా ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను మునిసిపల్ మెప్మా అధికారలు సిద్ధం చేసుకుంటున్నారు.

శ్రీవారి క్షేత్రంలో 13 నుంచి 15వరకు

సంక్రాంతి సంబరాలు

» 14న నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు రద్దు
» 15న కనుమ మహోత్సవం



శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో ఈనెల 13 నుంచి 15 వరకు సంక్రాంతి సంబరాలు జరుపుతామని ఆలయ ఇన్‌చార్జ్ ఈవో వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆలయ తూర్పుగోపురం వద్ద నున్న ఖాళీ స్థలంలో కోలాటాలు, భజనలు, నృత్యాలు, హరిదాసులు, బుడబుక్కల వేషధారణలతో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈనెల 14న సంక్రాంతి సందర్భంగా నిత్యార్జిత కల్యాణం, ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నామని భక్తులు గమనించాలని కోరారు. ఈనెల 15న మధ్యాహ్నం నుంచి స్వామివారు కనుమ పండుగ నిర్వహణ నిమిత్తం సమీప గ్రామమైన దొరసానిపాడుకు అట్టహాసంగా బయలు దేరి వెళ్తారని ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు భక్తులు తరలి రావాలని ఈవో కోరారు.

ప్రమాదం అంచున..





ముదినేపల్లి వద్ద కోతకు గురైన జాతీయ రహదారి.. 2021లో పరిశీలిస్తున్న ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ దృశ్యం (ఫైల్)

» రెండు దశాబ్దాలుగా కోసుకుపోతున్న రోడ్డు
» కలెక్టర్ ఆదేశాలను పట్టించుకోని అధికారులు

ముదినేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నెంబరు 165 పామర్రు - దిగమర్రు జాతీయ రహదారిలో ముదినేపల్లి జిల్లా పరిషత్ హైస్కూలు వద్ద ప్రమాదం పొంచి ఉంది. కైకలూరు మార్గంలోని హైస్కూలు ఎదురుగా రెండు దశాబ్దాలుగా పోల్ రాజ్ ప్రధాన పంట కాల్వ నీటి ప్రవాహం వల్ల రోడ్డు మార్జిన్ పూర్తిగా కోతకు గురైంది. అప్పటి ఆర్ అండ్‌బీ అధికారులు కానీ, ప్రస్తుత జాతీయ రహదారుల అథారిటీ అధి కారులు కాని పట్టించుకో లేదు. జాతీయ రహ దారి విస్తరణ పనుల్లో ఈ కోతకు గురైన ప్రాంతంలో రక్షణ చర్యలు చేపట్టడం లేదు. ఈ రహదారి విస్తరణ కాల్వ వైపున లేక పోవడంతో ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు కోత ను నివారించేందుకు చర్యలు చేపట్టడం లేదు. మార్జిన్ పూర్తిగా కాల్వలో కలసిపోయి రోడ్డు అంచులుగా విరిగిపడుతోంది. ఆ ప్రాంతంలో ముళ్ల పొదలు పెరిగిపోవడంతో కోతకు గురైన కొంత ప్రదేశం కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. 2021లో అప్పటి ఉమ్మడి కృష్ణా జిల్లా కలెక్టర్ ఇంతియాజ్ స్వయంగా పరిశీలించి కోసుకు పోయిన రోడ్డు ప్రాంతాన్ని వెంటనే పూడ్చించాలని రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులకు ఆదే శించినా అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు. ఎన్‌హెచ్ అధికారులు కోతకు గురైన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

దర్జాగా దందా!



తాటియాకులగూడెంలో ట్రాక్టర్లపై అక్రమంగా మట్టిని తరలిస్తున్న దృశ్యం

మట్టి, ఇసుక అక్రమంగా తెలంగాణకు తరలింపు

సరిహద్దు చెక్‌పోస్టు సిబ్బందిపై విమర్శలు



నెర్సుగూడెం వద్ద ఆంధ్రా నుంచి తెలంగాణకు ట్రాక్టరుపై ఇసుక తరలింపు

జీలుగుమిల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఇసుక, మట్టి అక్రమ రవాణాతో మాఫియా దారులు జేబులు నింపుకుంటున్నారు. ఇటీవల ఆంధ్రా నుంచి తెలంగాణ సమీప అశ్వారావుపేటకు మట్టి, ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాష్ట్ర సరిహద్దు తాటియాకులగూడెం చెక్‌పోస్టు సిబ్బంది చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తాటియాకులగూడెం నుంచి ట్రాక్టర్ మట్టి తెలంగాణకు రూ.800 నుంచి రూ.1000 వరకు, నెర్సుగూడెం నుంచి, రౌతుగూడెం సంఘంవాగు నుంచి ట్రాక్టర్ ఇసుకను రూ.2,500 వందల నుంచి 3,500 వరకు అమ్ముకుని మట్టి, ఇసుక మాఫియా దారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంతకాలంగా ఇదే విధంగా అక్రమ రవాణ సాగుతోందని భవిష్యత్‌లో సమీప వాసులకు వాగులు కాల్వల్లో ఇసుక కనీస అవసరాలకు లేకుండా పోతుందని స్థానిక గిరిజనులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు అక్రమ రవాణాపై దృష్టి సారించా లని, ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత ఇసుక పాలసీ పక్కదోవ పట్టకుండా చూడాలని కోరుతున్నారు. మట్టి, ఇసుక అక్రమ రవాణాపై వివరణ కోరేందుకు వీఆర్వో బుల్లిఅబ్బులు, ఇన్‌చార్జీ తహసీల్దార్ స్లీవజోజికి ఫోన్ చేయగా అందుబాటులో లేరు.

నేడు వైవాకలో అసైన్డ్ భూముల విచారణకు గ్రామసభ

ముదినేపల్లి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వైవాక గ్రామ పరిధిలోని అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి సోమవారం ప్రత్యేక గ్రామసభను రెవెన్యూ అధికారులు నిర్వహించనున్నారు. ఆ గ్రామ ఏరియాలోని వందలాది ఎకరాల అసైన్డ్ భూముల్లో గతంలో 120 ఎకరాల భూములను స్వాతంత్ర్య సమరయోధులకు కేటాయించి పట్టాలు ఇచ్చారు. అనంతరం ఆ భూములు పలు చేతులు మారాయి. వాటిపై వివాదాలు కూడా తలెత్తాయి. ఆ భూముల పట్టాలు పొందిన స్వాతంత్ర్య సమర యోధులు వేరే రైతులకు విక్రయించిన అనంతరం మరి కొంత మంది కొనుగోలు చేశారు. 2016లో అసైన్డ్ భూములను చట్టం ప్రకారం 22ఏ సెక్షన్‌లో చేర్చి క్రయ విక్రయాలపై నిషేధం విధించారు. ప్రస్తుతం ఆ భూములు చెరువులుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో అనుభవదారుల వినతి మేరకు ఈ అసైన్డ్ భూములపై విచారణ జరిపి హక్కుదార్లను వ్యక్తిగతంగా గుర్తించేందుకు, హక్కు పత్రాలను పరిశీలించేందుకు సోమవారం ప్రత్యేకంగా గ్రామసభను నిర్వహించనున్నారు. ఈ సభలో ముదినేపల్లి తహసీల్దార్ సుభానీతోపాటు పెదపాడు తహసీల్దార్ జ్యోతి మండల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొంటారు. హక్కు దారుల నుంచి పత్రాలను స్వీకరించి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తహసీల్దార్ తెలిపారు.

డీలర్ల గగ్గోలు!



జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ పాయింట్లలో నిత్యావసర సరుకులతో నిలిపి ఉన్న లారీలు

జంగారెడ్డిగూడెం మండలంలోని రేషన్ దుకాణాలకు చేరని కందిపప్పు

నాలుగురోజులుగా లోడ్ లారీలను నిర్లక్ష్యంగా వదిలివేసిన కాంట్రాక్టరు



ఏలూరు,జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం మండలంలో డీడీలు తీసిన పలువురు రేషన్ డీలర్లకు ఇప్పటి వరకు పంచదార, కందిపప్పు అందక పోవడంతో అటు డీలర్లు ఇటు ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండలంలో 54 రేషన్ దుకాణాలుండగా వీటిలో 19 రేషన్ దుకాణాలకు కందిపప్పు, పంచదార అందలేదు. జనవరి మూడో తేదీ శుక్ర వారం జంగారెడ్డిగూడెం ఎంఎల్ఎస్ పాయింట్‌లో మండలంలోని పలు రేషన్ షాపులకు కందిపప్పు, పంచదారను రెండు లారీలలో ఎక్కించారు.ఆరోజే రేషన్ దుకాణాలకు సరుకులు అందజేయాల్సి ఉండగా నాలుగు రోజులు గడిచినా దుకాణాలకు చేరుకోలేదు.సరుకులను లారీల్లో లోడింగ్ చేసినప్పటి నుంచి సరుకు డీలరు దుకాణానికి చేరవేసేంత వరకు సంబంధిత కాంట్రాక్టరుదే పూర్తి బాధ్యత.కానీ ఇక్కడ కాంట్రాక్టరు నిర్లక్ష్యం వల్ల ప్రజలకు అందాల్సిన నిత్యవసర సరుకుల లారీలను నాలుగు రోజులుగా అశ్రద్ధగా ఎంఎల్ఎస్ పాయింట్లలోనే వదిలివేశారు. దీనిపై అధికారులు కాంట్రాక్టరుతో మాట్లాడినా స్పందించడం లేదని తెలుస్తోంది. సంక్రాంతి పండగకు కందిపప్పు, పంచదార తీసుకుందామన్న కార్డుదారులకు కాంట్రాక్టరు తీరుతో అందే పరిస్థితి లేదు. కందిపప్పుకు, పంచదారకు డీడీలు చెల్లించిన పలువురు డీలర్లకు అవి అందకపోవడంతో జనవరి ఒకటో తేదీ నుంచి కొందరు డీలర్లు కేవలం బియ్యం మాత్రమే కార్డుదారులకు ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేశారు. ఇప్పటికే కొన్ని రేషన్ దుకాణాలలో దాదాపు ఎనభైశాతానికి పైగా సేల్స్ పూర్తయ్యింది. కందిపప్పు కోసం అప్పు తీసుకొచ్చి డీడీలు చెల్లించామని సేల్స్ ప్రారంభమై ఐదు రోజులైనా ఇంకా రాకపోవడంతో అప్పు ఇచ్చిన వారికి చెల్లించలేకపోవడమే కాకుండా సంక్రాంతి పండుగకు తమ చేతిలో డబ్బులు లేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కందిపప్పు,పంచదారను త్వరితగతిన అందించాలని డీలర్లు, ప్రజలు కోరుతున్నారు.



గుబ్బల మంగమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

బుట్టాయగూడెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ఏజెన్సీ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీ గుబ్బల మంగమ్మను దర్శించుకోడానికి భక్తులు అధిక సంఖ్యలో ఆదివారం ఏజెన్సీకి తరలివచ్చారు. భక్తుల రాకతో అమ్మవారి ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఆదివారం తెల్లవారుజామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లిం చుకున్నారు. ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేశారు.



నవ్య
కుటుంబ కదంబం

ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన భాను సురేష్‌బాబు. కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సెలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> **'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే. అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."**

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం

మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటు వైపు వెళ్లరు.


ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● **డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా**, చెన్నై

ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు





17 చుక్కలు, 17 వరుసలు

జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె

● ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం

● దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు

● కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.



సృజనాత్మకత పెరుగుతుంది

మహిళలు వేసే ముగ్గులు గుమ్మం వరకే పరిమితం కాకుండా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న ముత్యాల ముగ్గుల పోటీల వల్ల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. గత ఏడాది కూడా ప్రథమ స్థానంలో నిలిచాను. ఈ ముగ్గులు మంచి సంప్రదాయం. దీనివల్ల మహిళల్లో సృజనాత్మకత పెరుగుతుంది. ప్రతి మహిళ ముగ్గుల సంప్రదాయాన్ని కొనసాగించాలి.

- టి.ఆదిశ్రీ, ప్రథమ బహుమతి విజేత





చాలా సంతోషంగా ఉంది

పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడం చాలా ఆనందంగా ఉంది. వచ్చేసారి ప్రథమ బహుమతి సాధించడానికి కృషి చేస్తా. విజయవాడ, రాజమండ్రి, ఏలూరులలో నిర్వహించిన పలు ముగ్గుల పోటీల్లో పాల్గొని బహుమతులు సాధించాను. ఆంధ్రజ్యోతి నిర్వహించిన పోటీలలో పాల్గొనడం ఆనందంగా ఉంది.

- కె.ప్రత్యూష, ద్వితీయ బహుమతి విజేత





సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీక

సంస్కృతీ , సంప్రదాయాలకు ప్రతీక ముగ్గులు. ఆంధ్రజ్యోతి పోటీలు నిర్వహించడం అభినందనీయం. గతంలో స్థానికంగా కామవరపుకోటలో నిర్వహించిన పోటీలలో పాల్గొని బహుమతులు పొందాను. ఇప్పుడు ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో విజయం సాధించడం మరింత ఆనందాన్ని కలిగించింది.

- బి.మణి, తృతీయ బహుమతి విజేత







సప్తవర్ణ శోభితం

ఏలూరులో ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలు

ఏలూరుసిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. స్థానిక కేపీడీటీ హైస్కూల్ ప్రాంగణం సప్తవర్ణ శోభితమైంది. 'ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సారథ్యంలో మగువ ట్రెండింగ్ డిజైన్స్ ఎక్స్‌క్లూజివ్ ఉమెన్స్ వేర్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఈ ముగ్గుల పోటీలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ ముగ్గుల పోటీలకు కోస్పాన్సర్‌లుగా ఏలూరులోని ఆర్‌ఎస్ షాపింగ్‌మాల్, మలబార్ గోల్డ్ , ఏలూరు సాయిస్వర్ణ మోటార్స్ హీరో ఆథరైజ్డ్ డీలర్ వారు వ్యవహరించారు. జిల్లా నలుమూలల నుంచి 49 మంది మహిళలు, యువతులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. మంచును సైతం లెక్కచేయకుండా వందల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 6గంటల నుంచే ఏలూరుకు చేరుకున్నారు. ముగ్గులను తిలకించేందుకు నగరవాసులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు







పోటీలో విజేతలుగా తృతీయ స్థానంలో నిలిచిన బి.మణి, ద్వితీయ స్థానంలో నిలిచిన కె.ప్రత్యూష, ప్రథమ స్థానంలో నిలిచిన టి.ఆదిశ్రీలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా, మగువ ట్రెండింగ్ డిజైన్స్ అధినేత ఉండవల్లి అనూష, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు, ఆర్‌ఎస్ షాపింగ్‌మాల్ ప్రతినిధి సుబ్బారావు, ఏలూరు సాయిస్వర్ణ మోటార్స్ జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వరరావు



ముగ్గులను పరిశీలిస్తున్న బడేటి మీనా, ఉండవల్లి అనూష

మహిళల్లో సృజన్మాతకతను వెలికితీసేవేవి ముగ్గులు..

ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి బడేటి మీనా, మగువ ట్రెండింగ్ డిజైన్స్ అధినేత ఉండవల్లి అనూష , ఏలూరు సాయిస్వర్ణ మోటార్స్ జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వరరావు, ఆర్‌ఎస్ షాపింగ్ మాల్ ప్రతినిధి సుబ్బారావు ముఖ్యఅతిథులుగా హాజరై ఈ ముత్యాల ముగ్గుల పోటీలలో పాల్గొన్న మహిళలందరికీ అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల్లో సృజనాత్మకతను ముగ్గులు వెలికితీస్తాయని, మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా ముగ్గులు నిలుస్తాయన్నారు. ఇటువంటి పోటీలు నిర్వహిస్తున్న ఏబీఎన్, ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు. ఆంధ్రజ్యోతి తాడేపల్లిగూడెం యూనిట్ బీఎం హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి డి.రామకృష్ణ, ఏలూరు జిల్లా ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు, ఐసీడీఎస్ సీడీపీవో తులసి, మాజీ ఉపాధ్యాయిని భ్రమరావతి, మానవత నిర్మల, పద్మావతి, విజయలక్ష్మి మాట్లాడుతూ ముగ్గులు తెలుగు సంప్రదాయమని, సంక్రాంతి పండుగ వేళ ముగ్గుల ప్రాముఖ్యతను వివరించారు.



ముగ్గులను పరిశీలిస్తున్న మలబార్ గోల్డ్ ప్రతినిధులు, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు

విజేతలు వీరే..

పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఏలూరుకు చెందిన ఈదర సరస్వతి, చాంద్ లునానీ, పీఎస్ లక్ష్మి వ్యవహరించారు. నిబంధనలకు అనుగుణంగా చుక్కల ముగ్గులకు ప్రాధాన్యత ఇచ్చారు. పోటీల్లో ప్రథమ స్థానంలో పోలవరానికి చెందిన టి.ఆదిశ్రీ (రూ.6 వేలు), ద్వితీయ స్థానంలో హనుమాన్ జంక్షన్‌కు చెందిన కె.ప్రత్యూష (రూ.4 వేలు), తృతీయ బహుమతి కామవరపుకోటకు చెందిన బి.మణి (రూ.3 వేలు) నగదు బహుమతులు గెలుచుకున్నారు. విజేతలకు బడేటి మీనా , ఉండవల్లి అనూష, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు బహుమతులను అందజేశారు. మరో 20 మందికి కన్సొలేషన్ బహుమతులను అందజేశారు. ఎ.దానేశ్వరి, ఇ.అమ్మాజీ, నాగవేణి, తేజశ్రీ, లత, రాజ్యలక్ష్మి, మేఘన, పావని, జాహ్నవి, కిరణ్మయి, దుర్గాభవాని, అలివేలు మంగతాయారు, కామాక్షి, దేవి, గోపాలమ్మ, సౌమ్య, వరలక్ష్మి, దేదీప్య, శశిఅన్నపూర్ణ, సాయిలక్ష్మిలకు కన్సొలేషన్ బహుమతులు గెలుపొందారు. మరో 26 మందికి కూడా ప్రత్యేక బహుమతులను అందజేశారు.



విజయవాడ ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై డీటీఎఫ్ పోరుబాట

ఏలూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఉద్యమ బాట పట్టింది. రాష్ట్రస్థాయి ధర్నాను ఈ నెల 11న విజయవాడలో చేపట్టనున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరహరి, ఎస్వీ రమణయ్య ఆదివారం ఏలూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. నరహరి మాట్లాడుతూ జీవో 117ను పూర్తిగా రద్దుచేయకుండా, దానికి సవరణలు చేసే విధంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు యత్నిస్తుండటం సరైంది కాదన్నారు. కేవలం ప్రభుత్వ గుర్తింపువున్న ఉపాధ్యాయ సంఘాలతో మాత్రమే విద్యాశాఖ డైరెక్టర్ ప్రతీ శుక్రవారం సమావేశాలు నిర్వహించి కొన్ని నిర్ణయాలను ప్రకటిస్తున్నారని, వాటిలో కొన్ని ఆమోద యోగ్యంగా లేవని విమర్శించారు. పదో తరగతి వరకు ఆంగ్లమాధ్యమంతో పాటే తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు ఓ విఫలప్రయోగమని, విద్యాహక్కు చట్టంప్రకారం ఓ ఆవాసప్రాంతం (హేబిటేషన్) లోవున్న పాఠశాలలన్నింటినీ కలపడం సరికాదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని, వాటిని స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లతో నడపాలని డిమాండ్ చేశారు.ఇంటర్‌విద్యతో నిర్వహిస్తోన్న హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పాత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఐటీడీఏ పాఠశాలల్లో వ్యాయా మోపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో రద్దయిన జీవో 3లోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొత్త పీఆర్సీని ప్రకటించేలోగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్రకార్యదర్శి సురేష్‌కుమార్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాంతారావు, ఆదినారాయణ, తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షుడు శివబ్రహ్మం, త్రినాథరావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ ప్లేయర్ మోహన్‌బాబుకి సత్కారం



పెదవేగి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్ఎంఎస్ వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి, బౌలర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచిన బలుసు మోహన్ బాబును స్వగ్రామం ముండూరులో ఘనంగా సత్కరించారు. మోహన్‌బాబు ముండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతివరకు చదువుకున్నారు. ఏలూరు సీఆర్ఆర్ కళాశాలలో డిగ్రీవరకు చదివి ఉన్నత చదువులకు ఇంగ్లండ్ వెళ్ళి అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డారు. అక్కడి దేశవాళీ క్రికెట్ పోటీల్లో పాల్గొంటూ ఇటీవల కెన్యాలోని నైరోబియాలో జరిగిన కౌంటీల్లో ఇంగ్లండ్ తరుపున పాల్గొని బెస్ట్ బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచారు. అతని కుమారుడు హర్ష ఇంగ్లండ్ రంజీ జట్టు ప్లేయర్‌గా రాణిస్తున్నాడు. స్వగ్రామం వచ్చిన మోహన్‌బాబును పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్థులు సత్కరించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు సాంబశివరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు, మాజీ సర్పంచ్ పర్వతనేని రాజరాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యా యులు ఎస్.బలరామయ్య, ఏడీవీ.ప్రసాద్ పాల్గొన్నారు.

హయగ్రీవునిగా అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి



పాలకొల్లు అర్బన్, జవనరి,5 (ఆంధ్ర జ్యోతి): ధనుర్మాసం 21 రోజు ఆదివారం పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో టీటీడీ ప్రబంధ ట్రస్టు అనుమతి పొందిన నూలి మాధురి తిరుప్పావై ప్రవచనం చేశారు. రాక్షసులను సంహరణ చేసి వేద పరిరక్షణ గావించి సంపదనొసంగు (వేదనారాయణుడు) హయగ్రీవునిగా, గోపికలతో గోపికగా నిద్రలేచి, స్వామి చెంతన నీలా దేవిగా కటాక్షించిన రీతిని వర్ణించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పవన్ కుమార్, వెంకట కృష్ణమాచార్యులు స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, తిరుమంజన సేవలు నిర్వహించారు. హయగ్రీవునిగా ప్రత్యేక అలంకరణ చేశారు.

హాఫ్ సెంచరీ దాటేసిన కూరగాయల ధరలు

పెంటపాడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం మార్కెట్‌లో కూరగాయల ధరలు భగ్గుమన్నాయి. ప్రతీ కూరగాయ ధర రూ.60 నుంచి రూ.70 లకు ఎగబాకింది. కొన్ని రోజుల వరుకూ నిలకడగా ఉన్న కూరగాయల ధరలు గత వారం నుంచి పెరగడం మొదలు పెట్టాయి. ఈవారం అయితే ఆకాశాన్ని తాకాయి. రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే వారానికి సరిపడ కూరగాయలు రాని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ధనుర్మాసం కావడంతో కూరగాయ ధరల పెరుగుదలకు కారణమంటూ వ్యాపారులు చెబుతున్నారు., ధరలు చూసి వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ధరలు ఇలా ఉంటే కొనలేం..తినలేం అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మార్కెట్‌లో కూరగాలయ ధరలు ఇలా ఉన్నాయి. బీరకాయలు కేజీ రూ.60, వంకాయిలు తెల్లవి, నల్లవి కేజీ రూ.60, బెండకాయలు కేజీ రూ.60, కాకరకాయలు రూ.60, టమాటో కేజీ రూ.20, దోసకాయలు కేజీ రూ.60, అరటి కాయలు 3- రూ.20 , మునగకాయలు ఒక్కటి రూ.15, క్యారెట్ కేజీ రూ.60, కాప్సికం కేజీ రూ.80, బీన్స్ రూ.100-120, చిక్కుడు కాయలు రూ.80, పచిమిర్చి రూ.40-50, ఉల్లిపాయలు రకం బట్టి కేజీ రూ.30 నుంచి 40 , అల్లం పాతది కేజీ రూ.60-80 అమ్ముతున్నారు..



తాడేపల్లిగూడెంలో కూరగాయల విక్రయాలు

పేరంటాలపల్లి పరిశీలించిన ఫారెస్ట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్



కుక్కునూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, హెడ్ ఆఫ్‌ది ఫారెస్ట్ ఫోర్స్ అధికారి చిరంజీవి చౌదరి రాజమండ్రి సర్కిల్ పరిధిలో మూడు రోజులుగా పర్యటిస్తున్నారు. రాజమండ్రి నుంచి గోదావరి నదీ మార్గంలో పాపికొండలలోని నేషనల్ పార్క్ ఏరియాలో సందర్శించారు. అనంతరం కొరుటూరు మీదుగా క్షేత్రపరిశీలన నిర్వహిస్తూ కుక్కునూరు అటవీ రేంజ్ పరిధిలో ఉన్న పేరంటాలపల్లి గ్రామానికి విచ్చేశారు. అక్కడ రామకృష్ణ ముని ఆశ్రం, విశ్వేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించారు. పేరంటాలపల్లి గ్రామస్థులతో మాట్లాడారు. వెదురుతో చేస్తున్న వస్తువులు తగిన మార్కెటింగ్ సదుపాయం కలిగేలా ఐటీడీఏ అధికారులతో మాట్లాడి ఆర్థిక ఎదుగుదలకు సహకారం అందేలా చూడాలని స్థానిక సిబ్బందికి సూచించారు. ప్లాస్టిక్‌రహిత, నేషనల్ పార్క్ చట్టాలపై పర్యాటకులకు గ్రామస్థులకు తగిన సూచనలు జారీ చేయాలని వన్యప్రాణుల సంరక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.

సేవల్లో లంకలకోడేరు పీహెచ్‌సీకి రాష్ట్రంలో ప్రథమస్థానం



పీహెచ్‌సీ వద్ద డెంగీ వ్యాధి పట్ల అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది (ఫైల్‌ఫొటో)

పాలకొల్లు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి రాష్ట్రవ్యాప్తంగా గ్రేడ్‌వన్ ప్రథమ స్థానంలో నిలిచిందని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆదివారం విలేఖర్లకు తెలిపారు. ప్రతీరోజు ఇన్‌పేషెంట్లు, అవుట్ పేషెంట్లకు ల్యాబ్ టెస్ట్‌లు చేయడంలో, ప్రసవాలు చేయడంలో, అత్యవసర వైద్యసేవలు అందించటంలో, మహమ్మారి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో, గర్భిణులకు అందించే వైద్యసేవలకు గాను లంకలకోడేరు పీహెచ్‌సీ రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించిందన్నారు. దీంతో జిల్లా కలెక్టర్ సి.నాగరాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మహే శ్వరరావు పీహెచ్‌సీ సిబ్బందిని అభినందించారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ చిటూరి కనకలక్ష్మి, సభ్యులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు అభినందించారు.



బాడవలో అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు

సంక్రాంతిలోగా గోతుల్లేని రహదారులు

ఏడు గ్రామాల్లో రూ.1.75 కోట్లతో అభివృద్ధి పనులకు మంత్రి నిమ్మల శ్రీకారం

యలమంచిలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెడుతున్నాయని రాష్ట్ర జలవనరులశాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. యలమంచిలి మండలం బాడవ, ఏనుగువానిలంక, కలగంపూడి, చించినాడ, కాజ తూర్పు, కాజ పడమర, కొంతేరు గ్రామాల్లో రూ.1.75 కోట్ల నిధులతో నిర్మించనున్న సీసీ రహదారులు, డ్రైన్‌లు, పలు అభివృద్ధి కార్యక్రమాల నిర్మాణపనులకు మంత్రి నిమ్మల ఆదివారం భూమిపూజ చేసి శిలాఫలకాలను ఆవిష్కరించారు.రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తలపెట్టిన పల్లెపండుగ కార్యక్రమం ద్వారా రాష్ట్రమంతటా గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతగా జరుగుతున్నాయన్నారు. సంక్రాంతిలోపుగా అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేసి, గుంతలు లేని ఆంధ్రప్రదేశ్‌ను ప్రజలకు చూపించి జాతికి అంకితం చేస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ గానీ, ఒక్క టీచర్ పోస్టుగానీ వేయలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిని వెంటనే డీఎస్సీ 16500 పోస్టులకు ఆమోదం తెలిపారని, వచ్చే విద్యాసంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని తెలిపారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి 48 గంటల్లో సొమ్ములు చెల్లిస్తున్నామని దీంతో ఏ గ్రామానికి వెళ్లినా రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి, దేశంలోనే మన ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా నిలుపుతామని మంత్రి పేర్కొన్నారు. మామిడిశెట్టి పెద్దిరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, కడలి గోపి, మాతా రత్నం రాజు, రుద్రరాజు సత్యనారాయణరాజు, ఆరుమిల్లి చిన్ని, రాయి శ్రీనివాసరావు, చిటూరి ఆంజనేయులు, తాళ్ల నాగరాజు పాల్గొన్నారు.



భీమవరం పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయం దీపకాంతుల్లో శోభిల్లింది.. ధనుర్మాసం సందర్భంగా ఆదివారం రాత్రి ఆలయంలో లక్ష దీపోత్సవం వైభవంగా నిర్వహించారు.





మోగిన శంఖం

కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతి, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు





సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద



హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని దక్షిణమధ్య రైల్వే 52 అదనపు ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా మీదుగా నడిచే రైళ్ళు కూడా ఉన్నాయి. ఈ రైళ్ళు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగనున్నాయి. విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి స్టేషన్లతో పాటు ఇతర జిల్లాలో స్టేషన్లలో ఆగనున్నాయి.

07037 వికారాబాద్ - కాకినాడ టౌన్ జనవరి 13వ తేదీ
07038 కాకినాడ టౌన్ - వికారాబాద్ జనవరి 14వ తేదీ
07035 చర్లపల్లి - నర్సాపూర్ జనవరి 11, 18 తేదీల్లో
07036 నర్సాపూర్ - చర్లపల్లి జనవరి 12, 19
07078 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ 12, 19
07079 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ 12, 19
07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ 8, 10, 12, 14
07032 కాకినాడ టౌన్- చర్లపల్లి 9, 11, 13, 15
07033 చర్లపల్లి - నర్సాపురం 7, 9, 13, 15, 17
07034 నర్సాపురం - చర్లపల్లి 8, 10, 12, 14, 18
07488 కాకినాడ టౌన్ - నాందేడ్ 7, 14
07487 నాందేడ్ - కాకినాడ టౌన్ 6, 13
07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు 9, 12, 14
07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి 10, 13, 15 తేదీల్లో
07041 కాచిగూడ - శ్రీకాకుళం రోడ్డు 7వ తేదీ
07042 శ్రీకాకుళం రోడ్డు - కాచిగూడ 8వ తేదీన ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు రైల్వే అధికారులు తెలిపారు.

క్రైమ్ కార్నర్



ఆందోళనకారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

యువతి ఆత్మహత్య

ప్రియుని వేధింపుల వల్లే అంటూ బంధువుల రాస్తారోకో

నరసాపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని ప్రగతి నగర్‌లో లక్ష్మీకుమారి (19) శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతికి ప్రియుడు కవురు గీతచరణ్ వేధింపులే కారణమంటూ ఆదివారం బంధువులు నరసాపురం-మొగల్తూరు రోడ్‌లోని ఓఎన్‌జీసీ కాల్వ వద్ద రాస్తారోకా చేశారు. అంతకు ముందు ప్రభుత్వ ఆస్పత్రి గేటు వద్ద కూడా ఆందోళన చేశారు. వీరి ఆందోళనకు సీపీఎం ఐద్వా జిల్లా కార్యదర్శి పూర్ణ, త్రిమూర్తులు మద్దతు తెలిపారు. దీంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు చేరుకుని ఆందోళన విరమింపజేసేందుకు ప్రయత్నించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. దీనికి స్పరైన హామీ ఇవ్వాలన్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నాయకర్ అక్కడికి చేరుకుని వారితో చర్చలు జరిపి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

వృద్ధుని అనుమానాస్పద మృతి

ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఒక వృద్ధుడు అనుమానస్పదంగా మృతి చెందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఏలూరు హనుమాన్ నగర్‌లోని రజకులవీధికి చెందిన కొణిదల బాబూరావు (60) భార్య ఏడాదిన్నర క్రితం మరణించింది. ఇద్దరు కుమార్తెలు ఉండగా వారికి వివాహాలయ్యాయి. బాబూరావు ఇస్త్రీ చేస్తూ జీవించేవాడు. అయితే మద్యానికి బానిస అయిన అతను గత నెల 31వ తేదీన పెన్షన్ డబ్బులు అందడంతో అప్పటి నుంచి అతిగా తాగడం మొదలు పెట్టాడు. ఏలూరు తంగెళ్ళ మూడి ప్రాంతంలో ఉన్న పోలీస్ ఔట్‌పోస్టు మెట్లపై పడుకుని అక్కడే మరణించాడు. ఆదివారం ఉదయం ఏలూరు టూటౌన్ పోలీసులకు సమాచారం అందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పురుగుమందుతాగి వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెం గ్రామానికి చెందిన పిచ్చయ్య (58) ఈనెల 4వ తేదీన ఏ కారణమో తెలియదు కాని పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

చంపేస్తానంటూ బెదిరింపులు

యువకుడిపై కేసు నమోదు

ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఒక యువతిని, ఆమె కుటుంబ సభ్యులను చంపి వేస్తానని దుర్భాషలాడుతున్న యువకునిపై ఏలూరు త్రిటౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏలూరు శాంతినగర్‌కు చెందిన ఒక యువతి (24)కు గతంలో పేరాబత్తుల జయదీప్ అనే యువకునితో పరిచయం ఉంది. వారి మధ్య కొన్ని విబేధాలు రావడంతో అతనిపై కేసు పెట్టి ఆతరువాత రాజీ చేసుకున్నారు. ప్రస్తుతం ఆ యువతి ఉన్నత చదువుల కోసం వేరే రాష్ట్రానికి వెళ్ళిపోయింది. ఇటీవల సెలవులకు తన తల్లితో కలిసి ఏలూరులోని తన మేనమామ ఇంటికి రావడంతో ఆ యువతికి ఈనెల 1వ తేదీ నుంచి ఫోన్లు చేసి బెదిరిస్తున్నాడు. ఆమె లేనప్పుడు ఆమె మేనమామ ఇంటికి వెళ్ళి బెదిరించాడు. కనిపిస్తే చంపి వేస్తానని ఆ ఇంట్లో పని మనిషికి చెప్పి వెళ్ళాడు. దీంతో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురై ఏలూరు త్రి టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ ప్రసాద్ ఆదివారం జయదీప్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అగ్ని ప్రమాదంలో వృద్ధురాలి మృతి

భీమడోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదంలో తీవ్ర గాయాలై వృద్ధురాలి మృతి చెందిన ఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేశారు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామం జగ్గంవీధినకు చెందిన వాసిరెడ్డి సత్యవతి (85) తన ఇంట్లో నివసిస్తుంది. ఈనెల 4వ తేదీన వంట గదిలో టీ తాగుతుండగా ప్రమాదవశాత్తు చీరకొంగుకు మంటలు అంటుకుని తీవ్ర గాయాలపాలైంది. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సారా బట్టీలపై దాడులు..

800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

ముసునూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సారా బట్టీలపై ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ ఎ.మస్తానయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. చిల్లబోయినపల్లిలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. అక్కడ నుంచి అనగాని చంద్రరావు అనే వ్యక్తి పారిపోయాడని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ భోగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్, నూజి వీడు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

కన్సొలేషన్ బహుమతులు



ఏలూరులో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, మగువ ట్రెండింగ్ డిజైన్స్ వారి ఆధ్వర్యంలో..

హరివిల్లు

ఏలూరుసిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో సంక్రాంతి పండుగ ముందే వచ్చేసింది. ఆదివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముగ్గుల పోటీలు అందరినీ ఆకట్టుకున్నాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఉదయం ఆరు గంటలకే మహిళలు, యువత, విద్యార్థులు ఏలూరు కేపీడీటీ హైస్కూల్‌కు చేరుకున్నారు. జిల్లా నుంచే కాకుండా పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలు పట్టణాల నుంచి పోటీలకు విచ్చేసి ముగ్గులు వేశారు. న్యాయనిర్ణేతలు ముగ్గులను పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. పోటీల్లో మొత్తం 49 మంది పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు అందరికి కన్సొలేషన్, ప్రత్యేక బహుమతులను అందజేశారు.

ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ తోపాటు మగువ ట్రెండింగ్ డిజైన్స్ వారు సంయుక్తంగా నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు కో-స్పాన్సర్‌లుగా ఏలూరులోని ఆర్ఎస్ షాపింగ్‌మాల్, మలబార్ గోల్డ్, ఏలూరు సాయిస్వర్ణా మోటార్స్ హీరో ఆథరైజ్డ్ డీలర్ వారు వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా ఏలూరు ఎమ్మెల్యే సతీమణి బడేటి మీనా, ముగువ ట్రెండింగ్ డిజైన్స్ అధినేత ఉండవల్లి అనూష, ఏలూరు సాయిస్వర్ణా మోటార్స్ జనరల్ మేనేజర్ ఏవీ సోమేశ్వరరావు, ఆర్ఎస్ షాపింగ్ మాల్ ప్రతినిధి సుబ్బారావు హాజరై పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ అభినందనలు తెలిపారు. న్యాయనిర్ణేతలుగా ఏలూరుకు చెందిన ఈదర సరస్వతి, చాంద్ లునానీ, పీఎస్ లక్ష్మి వ్యవహరించారు. న్యాయనిర్ణేతలతో పాటు గురుశర్మలను ఉండవల్లి అనూష ఘనంగా సత్కరించారు.

ఆంధ్రజ్యోతి బీఎం బి.హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్జి డి.రామకృష్ణ, బ్యూరో ఇన్‌చార్జి జీవీఎస్ఎన్ రాజు, ఆర్ఎం (ప్రొడక్షన్) గారపాటి శ్రీనివాస్, యాడ్స్ మేనేజర్ ఆర్‌బీజీ రాజు, ఏలూరుకు చెందిన మైలవరపు శర్మ (గురుశర్మ), ఆంధ్రజ్యోతి సిబ్బంది ఉదయ భాస్కర్, జయరాం, చందూరి రామకృష్ణ, గుజ్జుల శ్రీధర్, వేమూరి విద్యాసాగర్, గంజి బెనర్జీ, కె.మురళీమోహన్, బీపీఆర్ వరప్రసాద్, మోహన్‌బాబు, దుర్గారావు విజయ్, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.





ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సతీమణి మీనాకు సన్మానం





ఏలూరు కేపీడీటీ హైస్కూల్లో ముగ్గులను పరిశీలిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది



జంగారెడ్డిగూడెంలో శనివారం జరిగిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలకు విచ్చేసిన చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు బొకే అందజేస్తున్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ చైర్మన్ మద్దిపాటి చైతన్య, ఆంధ్రజ్యోతి బీఎం హరిబాబు



బహుమతులు అందజేసిన దృశ్యం

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి : ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సీసీ రోడ్లు, ప్రధాన రహదారుల మరమ్మతు పనులను వేగవంతం చేయాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆదివారం ధర్మాజీగూడెంలో గారపాటి బుజ్జయ్య ఇంటివద్ద కూటమి నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో జరుగుతున్న సీసీ రోడ్లు, ప్రధాన రహదారుల మరమ్మతు పనులను నాణ్యతగా పూర్తయ్యేలా స్థానిక నాయకులు కృషి చేయాలన్నారు. గరిమళ్ల చలపతిరావు, గారపాటి బుజ్జయ్య, మోరంపూడి వరప్రసాద్, శ్రీనివాసరావు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.



ధర్మాజీగూడెంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌ను కలిసిన కూటమి నాయకులు

మంచి ముగ్గు వెయ్యండి..

'మంచి ముగ్గు వేసి చింతలపూడి ఎమ్మెల్యేతో కలిసి సంక్రాంతి పండుగను జరుపుకోండి' అంటూ ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పిలుపునిచ్చారు. ధర్మాజిగూడెంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని మండలాల మహిళలకు, యువత, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరయ్యేవారు ఈనెల 9వ తేదీ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ తమ ఇంటిముందు ముగ్గులు వేసి ఆ ముగ్గుల ఫొటోలను 12వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి 13 తేదీ ఉదయం ఏడు గంటలలోపు ఈ కింది నంబర్లకు చింతలపూడి మండలం 99963 68999, లింగపాలెం మండలం 63052 20897, కామవరపుకోట మండలం 83748 38385, జంగారెడ్డిగూడెం మండలం 94949 39382, జంగారెడ్డిగూడెం టౌన్ 63005 49688 ఫోన్ నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. విజేతలకు సంక్రాంతి రోజున బహుమతులు అందజేసి పండుగ రోజుల్లో విజేతల కుటుంబ సభ్యులతో కలిసి పండుగ జరుపుకుంటానన్నారు.



నూతనంగా ఎన్నికైన గ్రామ వ్యవసాయ సహాయకుల సంక్షేమసంఘం సభ్యులు

వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వినోద్‌కుమార్

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా వ్యవసాయ సహాయకుల విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర వ్యవసాయ సహాయకుల సంఘం ఉపాధ్యక్షుడు తొర్లపాటి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవఅధ్యక్షుడు బొడ్డేపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ ఏ సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించేందుకు నూతన కార్యవర్గం పనిచేయాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా గుడిదల బాలార్జున్, ట్రెజరర్‌గా స్వర్ణలత, అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా టి.రమేష్, ఉపాధ్యక్షుడిగా పంజా కాశీప్రసాద్, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎం.రవిచంద్ర, మహిళా అధ్యక్షురాలిగా డి.రేష్మా, జాయింట్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, వి.రాజు, పవన్, సభ్యులుగా శివనాగరాజు, టి.అజయ్‌కుమార్, రాణి, కోటేశ్వరరావు, అభినాష్, కె.వర్మలను ఎన్నుకున్నారు.

రేపు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి

ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలోని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర స్థాయి సదస్సు ఈనెల 7న విజయవాడలో కార్మికులంతా జయప్రదం చేయాలని ఏలూరు ఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ కోరారు. ఆదివారం ఏలూరు ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదురుగా సంబంధిత పోస్టర్‌ను రాష్ట్ర ప్రచార కార్యదర్శి టీపీఆర్ దొర పలువురు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దొర మాట్లాడుతూ ఆర్టీసీలో త్వరలో ప్రవేశపెడుతున్న విద్యుత్ బస్సుల నిర్వహణ ఆర్టీసీకి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జీవో ద్వారా 2029 నాటికి వంద శాతం ఆర్టీసీ బస్సులు విద్యుత్ బస్సులుగా మార్చాలని జీవో ఇచ్చారని ఈ మేరకు 2029 నాటికి అన్ని ప్రైవేటు విద్యుత్ బస్సులే వస్తే ఆర్టీసీ ఉద్యోగుల ఉద్యోగాలకు భద్రత ఉండదని, ప్రజలకు కూడా ఛార్జీల భారం పెరుగుతుందన్నారు. ఏలూరు జిల్లా కార్యదర్శి ఎస్ సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కౌలు రైతుకు రూ.2 లక్షల పంట రుణం ఇవ్వాలి

ఏలూరు కార్పొరేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రిజర్వు బ్యాంకు ఆదేశాల ప్రకారం ప్రతీ కౌలు రైతుకు రెండు లక్షల రూపాయలు పంట రుణం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పవరుపేటలోని అన్నే భవనంలో కౌలు రైతులకు పంట రుణాల సమస్యలపై మాట్లాడారు. బ్యాంకర్లు అనేక నిబంధనలు పెట్టి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వడం లేదన్నారు. వ్యవసాయదారులకు ఎటువంటి హామీ లేకుండా పంట రుణాల పరిమితిని లక్షా 60 నుంచి రెండు లక్షల వరకు పెంచిందని చెప్పారు. పంట సాగుదారు హక్కు పత్రాలు పొందిన ప్రతీ కౌలు రైతుకు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో రైతు సంఘ జిల్లా కన్వీనర్ వెజ్జు శ్రీనివాసచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి
తరలి వెళ్లిన హిందువులు

విజయవాడ సమీపంలోని కీసరపల్లిలో నిర్వహించిన హైందవ శంఖారావం సభకు జిల్లావ్యాప్తంగా హిందువులు ఆదివారం తరలి వెళ్లారు. హిందువుల ఐక్యత వర్ధిల్లాలి, హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పించాలని, జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ బైక్ ర్యాలీలు నిర్వహించారు.

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ సమీపంలోని కేసరపల్లిలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హైందవ శంఖారావం బహిరంగ సభకు ఏలూరు నుంచి అధిక సంఖ్యలో బైక్ ర్యాలీగా తరలివెళ్లారు. బైక్ ర్యాలీని తపనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మొండూరు ఆశ్రమ పీఠాధిపతి శ్రీకృష్ణ చరణానంద భారతీస్వామి జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీ బైపాస్‌రోడ్డు, వట్లూరు మీదుగా కేసరపల్లి వరకు సాగింది. ర్యాలీలో సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్, ఓలేటి సత్యనారాయణ, వీహెచ్‌పీ కార్యకర్తలు పాల్గొన్నారు. 500 బస్సులు, 800 కార్లు, 1200 మోటారు బైక్‌లపై హైందవ శంఖారావానికి వస్తున్నారని గారపాటి సీతారామాంజనేయ చౌదరి తెలిపారు.

- చింతలపూడి/ఏలూరు/కామవరపుకోట/లింగ పాలెం : హైందవ శంఖారావం సభకు చింతలపూడి నుంచి పది బస్సులలో నిమ్మగడ్డ దుర్గారావు, సురేంద్రరాజు పలువురి ఆధ్వర్యంలో కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. జంగారెడ్డిగూడెం పట్టణం, మండలంలోని పలు గ్రామాల నుంచి పరిషత్ సభ్యులు కేవీఆర్. సత్యనారాయణ ఆధ్వర్యంలో, కామవరపుకోట మండలంలో పోలాసిగూడెం, కళ్ళచెరువు, జీలకర్రగూడెం, తడికలపూడి, తూర్పుయడవల్లి తదితర గ్రామాల నుంచి పలు వాహనాల ద్వారా బీజేపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ ఒంటెద్దు యేసువరప్రసాద్, మండల అధ్యక్షుడు బాలవర్ధిరాజు, కాకి చంటి, చెలికాని బాస్కరరావు ఆధ్వర్యంలో తరలి వెళ్లారు. లింగపాలెం మండలంలో రాయంకుల చక్రధరరావు ఆధ్వర్యంలో పరసా కిషోర్, కుర్రా సుబ్రహ్మణ్యవరప్రసాద్, పలువురు విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు తరలి వెళ్లారు.
- పోలవరం/బుట్టాయగూడెం/ టి.నరసాపురం/జీలుగుమల్లి : పోలవరం మండలం నుంచి బీజేపీ నాయకులు కరిబండి నాగరాజు ఆధ్వర్యంలో హిందువులు భారీ సం ఖ్యలో తరలి వెళ్లారు. బుట్టాయగూడెం మండ లం రెడ్డిగణపవరం నుంచి 40మంది భక్తులు ఆదివారం ప్రైవేట్ బస్సులో తరలివెళ్ళినట్లు కనకదుర్గ అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనుంజయరాజు తెలిపారు. టి.నరసాపురం మండలం నుంచి బీజేపీ మండల అధ్యక్షులు మాలెంపాటి హరిబాబు, అద్దంకి జగ్గారావు, పసుమర్తి రాము, పర్వతనేని మురళీ, కమ్మిల రమేష్‌రాజు, నల్లూరి శ్రీవాసరావు, మరీదు నాగేశ్వరరావు తదితరులు తరలివెళ్లారు. జీలుగుమిల్లి నుంచి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టిఎస్.రవికుమార్ ఆధ్వర్యంలో పలు గిరిజన గ్రామాల వారు తరలి వెళ్లారు.
- పెదవేగి/పెదపాడు : పెదవేగి మండలం గన్నవరం నుంచి హైందవ శంఖారావం కమిటీ సభ్యుడు ఉండవల్లి వెంకట్రావు ఆధ్వర్యంలో 35 బస్సులతోపాటు కార్లలో రెండు వేల మందికి పైగా తరలివెళ్లారు కామిరెడ్డి మురళి, కొడవలి సాయిరామ్, పామర్తి శ్రీను, పెనుబోయిన రమేష్ పాల్గొన్నారు. పెదపాడు మండలం కలపర్రు టోల్‌ప్లాజా దగ్గర బీజేపీ నాయకుడు గారపాటి సీతారామాంజనేయచౌదరి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.
- కుక్కునూరు : కుక్కునూరు మండలం నుంచి హైందవులు ఎనిమిది బస్సులు, పదుల సంఖ్యలో కార్లలో తూము వెంకటేశ్వరరావు, బాలకృష్ణ, బొల్లు ప్రసాద్, వాడపల్లి లక్ష్మణాచార్యులు, కృష్ణార్జునరావు, యుప్పాల సాంబశివరావు, తదితరుల ఆధ్వర్యంలో తరలి వెళ్ళారు.



భట్టువారిగూడెం నుంచి హైందవ శంఖారావానికి బయలుదేరుతున్న హిందువులు



ఏలూరు నుంచి ర్యాలీగా వెళుతున్న తపనా చౌదరి, హిందువులు

సమస్యల పరిష్కారమే
లక్ష్యంగా పనులు

పెదవేగి, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి) : ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించడానికి అనువుగా కృషి చేస్తున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల కార్యాలయంలో ఆదివారం ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ప్రజల సమస్యలను విన్న ఎమ్మెల్యే ప్రభాకర్ సంబంధిత శాఖాధికారులకు తెలియపర్చి, తక్షణం పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఐఆర్ ప్రకటనకు
ఎస్టీయూ డిమాండ్

ఏలూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీయూ జిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగింది. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పవన్ మాట్లాడుతూ పీఆర్సీ కమిషనర్‌ను వెంటనే నియమించాలని, కొత్త పీఆర్సీ వేతనాలు ఖరారయ్యేలోగా 30శాతం మధ్యంతర భృతి (ఐఆర్)ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సంఘ నాయకులు చంద్రశేఖర్, రామచంద్రయ్య, నారాయణ, రాము, తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కార్యవర్గం

భీమడోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు శ్రీవేంకటేశ్వర ఆటో ఓనర్స్, వర్కర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎంపిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా సాంబశివరావు, ఉపాధ్యక్షుడిగా ముప్పిడి సతీష్, కార్యదర్శి యోహాన్, జాయింట్ సెక్రటరీ సర్వేశ్వరరావు, కోశాధికారి అశోక్‌కుమార్‌లను ఎంపిక చేశారు.

నిర్వాసితులకు న్యాయం చేసేది కూటమి ప్రభుత్వమే

కుక్కునూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : పోలవరం నిర్వాసితులకు కూటమి ప్రభుత్వం ద్వారానే న్యాయం జరుగుతుందని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కుక్కునూరులో విలేకరులతో మాట్లాడారు. పోలవరం నిర్వాసితులకు పునరావాస పరిహారం అందించటం కూటమి ప్రభుత్వం వల్లే సాధ్యమైందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు అన్ని విధాలా మొండి చేయి చూపిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చంద్రబాబు ఆదేశాల మేరకు దాదాపు రూ.831 కోట్లు నిర్వాసితుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. ఈమేరకు నిర్వాసితులు గత ఐదేళ్ళుగా పడుతున్న కష్టాల నుంచి గట్టెక్కారన్నారు. అనంతరం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆదివారం రాత్రి కుక్కునూరులో బాణసంచా కాల్చుతూ కూటమి ఆధ్వర్యంలో నిర్వాసితులంతా భారీ ప్రదర్శన నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ పిచ్చుక రాజు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ఎం.యుగంధర్, వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



కుక్కునూరులో టీడీపీ నాయకుల ర్యాలీ

ఘనంగా ఘంటా మురళీ పుట్టినరోజు వేడుకలు

కామవరపుకోట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం కామవరపుకోట పంచాయతీలోని పాతూరు గ్రామంలోని ఆయన నివాసం వద్దకు కూటమి నాయకులు వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు గుంటుపల్లి సర్పంచ్ గోరింక దాసు, ఎంపీటీసీ కంఠమనేని పుష్పరాజ్యం, కూటమి పంచాయతీ కన్వీనర్ బేతిన వెంకట్రావు, వైస్ సర్పంచ్ బి.మోహన్‌సింగ్, కంఠమనేని అంజిమూర్తి బృందం మురళీకి శుభాకాంక్షలు తెలిపారు.

బోస్ శిబిరం కమిటీ అధ్యక్షుడిగా నాగేశ్వరరావు

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు బోస్ శిబిరం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఉదయం జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొరుపురెడ్డి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా కె.పూర్ణ, కార్యదర్శిగా ములగాల నాగరాజు, కోశాధికారిగా అల్లు పవన్‌కుమార్‌తో పాటు సభ్యులుగా కె.పార్థసారథి, జి.సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ, జి.రాఘవరంగారావు, ఎస్.రామారావు, కె.అచ్చిబాబు, పి.అప్పారావులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ బోస్ కమిటీ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని పేర్కొన్నారు. అనంతరం బోస్ పరిరక్షణ కమిటీ ఛైర్మన్‌గా అల్లు ఉమా మహేశ్వరరావు, సభ్యులుగా రాజనాల రామ్మోహన్ రావు, జి.శ్రీనివాసరావు, మజ్జి సూర్యకాంతారావు, కె.పూర్ణచంద్రరావు, పి.నాగేశ్వరరావు, ఏ.సాయిప్రసాద్, జి.రామ్‌ప్రసాద్ ఎన్నికయ్యారు.

టైగర్స్ క్లబ్ పోలవరం కన్వీనర్‌గా షెహిన్షా బాషా

ఏలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు టైగర్స్ క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ పోలవరం అసెంబ్లీ కన్వీనర్ గా స్వచ్ఛంద సేవకులు, మానవతీధీర అవార్డు గ్రహీత షేక్ షెహిన్షా బాషా ఎంపిక పట్ల పోలవరం మండలంలో పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు, ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మండల నాయకులు బుగ్గా మురళీకృష్ణ మాట్లాడుతూ కరోనా విపత్తు కాలంలో కొవిడ్‌తో మృతి చెందిన వారి మృతదేహాల దహన కార్యక్రమాలు నిర్వహించి సేవా నిరతిని చాటుకున్నారని గుర్తుచేశారు.

ఉత్సాహంగా
అండర్ -15 చెస్ పోటీలు

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు శాంతినగర్ 13వ రోడ్డులోని పి.పాల్ ఉడ్ గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఏలూరు జిల్లా స్థాయి అండర్-15 చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. కార్యక్రమానికి ఆ స్కూల్ ఏజీఎం ఎస్.బలరామ్ ప్రారంభించారు. పోటీల్లో జి.అభిషేక్ అబ్రహం ప్రథమ, జి.అనురూప్ మోషే ద్వితీయ, పి.హర్షవర్ధన్ తృతీయ, వి.కార్తికేయ 4వ స్థానంలో, పి.ఉదయ్‌కుమార్ 5వ స్థానం సాధించారు. పి.సాత్విక, కె.మమిత్‌కుమార్, నవనీత్, జశ్వంత్, ఎస్.కె పర్వాన్, ధరణి, ఎం.అశ్విన్, ఎం.బెన్ని, మోక్షిత తదితరులు విజయం సాధించారు. ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్ మాధవ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అబ్రహం గ్యారీ కాస్ప్రా అకాడమి ఆధ్వర్యంలో జరిగాయి. డైరెక్టర్ జి.యోహానంద్, ఆర్బిటర్స్ జి.స్వరూపరాణి, యదిత్య తదితరులు పర్యవేక్షించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు



ఏలూరు క్రైం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ పురస్కరించుకుని దక్షిణమధ్య రైల్వే 52 అదనపు ప్రత్యేక రైళ్ళను నడపనున్నట్లు విజయవాడ దక్షిణమధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. వీటిలో ఉమ్మడిపశ్చిమ గోదావరి జిల్లా మీదుగా నడిచే రైళ్ళు కూడా ఉన్నాయి. ఈ రైళ్ళు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆకివీడు, భీమవరం టౌన్, వీరవాసరం, పాలకొల్లు స్టేషన్లలో ఆగనున్నాయి. విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, నిడదవోలు, రాజమండ్రి స్టేషన్లతో పాటు ఇతర జిల్లాలో స్టేషన్లలో ఆగనున్నాయి.

07037 వికారాబాద్ - కాకినాడ టౌన్	జనవరి 13వ తేదీ
07038 కాకినాడ టౌన్ - వికారాబాద్	జనవరి 14వ తేదీ
07035 చర్లపల్లి - నర్సాపూర్	జనవరి 11, 18 తేదీల్లో
07036 నర్సాపూర్ - చర్లపల్లి	జనవరి 12, 19
07078 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్	12, 19
07079 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్	12, 19
07031 చర్లపల్లి - కాకినాడ టౌన్	8, 10, 12, 14
07032 కాకినాడ టౌన్- చర్లపల్లి	9, 11, 13, 15
07033 చర్లపల్లి - నర్సాపురం	7, 9, 13, 15, 17
07034 నర్సాపురం - చర్లపల్లి	8, 10, 12, 14, 18
07488 కాకినాడ టౌన్ - నాందేడ్	7, 14
07487 నాందేడ్ - కాకినాడ టౌన్	6, 13
07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు	9, 12, 14
07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి	10, 13, 15 తేదీల్లో
07041 కాచిగూడ - శ్రీకాకుళం రోడ్డు	7వ తేదీ
07042 శ్రీకాకుళం రోడ్డు - కాచిగూడ	8వ తేదీన ప్రత్యేక రైళ్లను నడపనున్నట్టు

రైల్వే అధికారులు తెలిపారు.



విజయవాడ ధర్నా కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీటీఎఫ్ నాయకులు

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై డీటీఎఫ్ పోరుబాట

ఏలూరు అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) ఉద్యమ బాట పట్టింది. రాష్ట్రస్థాయి ధర్నాను ఈ నెల 11న విజయవాడలో చేపట్టనున్నట్టు సంఘ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.నరహరి, ఎస్వీ రమణయ్య ఆదివారం ఏలూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో ప్రకటించారు. నరహరి మాట్లాడుతూ జీవో 117ను పూర్తిగా రద్దుచేయకుండా, దానికి సవరణలు చేసే విధంగా విద్యాశాఖ ఉన్నతాధికారులు యత్నిస్తుండటం సరైంది కాదన్నారు. కేవలం ప్రభుత్వ గుర్తింపువున్న ఉపాధ్యాయ సంఘాలతో మాత్రమే విద్యాశాఖ డైరెక్టర్ ప్రతీ శుక్రవారం సమావేశాలు నిర్వహించి కొన్ని నిర్ణయాలను ప్రకటిస్తున్నారని, వాటిలో కొన్ని ఆమోద యోగ్యంగా లేవని విమర్శించారు. పదో తరగతి వరకు ఆంగ్లమాధ్యమంతో పాటే తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ప్రకటించిన మోడల్ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు ఓ విఫలప్రయోగమని, విద్యాహక్కు చట్టంప్రకారం ఓ ఆవాసప్రాంతం (హేబిటేషన్) లోవున్న పాఠశాలలన్నింటినీ కలపడం సరికాదన్నారు. ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని, వాటిని స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లతో నడపాలని డిమాండ్ చేశారు.ఇంటర్‌విద్యతో నిర్వహిస్తోన్న హైస్కూల్ ప్లస్‌లను కొనసాగించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పాత పీఆర్సీ బకాయిలు, డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఐటీడీఏ పాఠశాలల్లో వ్యాయా మోపాధ్యాయుల పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, గిరిజన ప్రాంతాల్లో రద్దయిన జీవో 3లోని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.కొత్త పీఆర్సీని ప్రకటించేలోగా 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని కోరారు. విజయవాడలో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. సంఘ రాష్ట్రకార్యదర్శి సురేష్‌కుమార్, ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కాంతారావు, ఆదినారాయణ, తూర్పుగోదావరిజిల్లా అధ్యక్షుడు శివబ్రహ్మం, త్రినాథరావు, రాంబాబు, సుబ్రహ్మణ్యం, దాసు, తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లండ్ కౌంటీ క్రికెట్ ప్లేయర్ మోహన్‌బాబుకి సత్కారం



పెదవేగి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : ఎల్‌ఎంఎస్ వరల్డ్ కప్‌లో ఇంగ్లండ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి, బౌలర్ ఆఫ్‌ది టోర్నమెంట్‌గా నిలిచిన బలుసు మోహన్ బాబును స్వగ్రామం ముండూరులో ఘనంగా సత్కరించారు. మోహన్‌బాబు ముండూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతివరకు చదువుకున్నారు. ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాలలో డిగ్రీవరకు చదివి ఉన్నత చదువులకు ఇంగ్లండ్ వెళ్ళి అక్కడ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డారు. అక్కడి దేశవాళీ క్రికెట్ పోటీల్లో పాల్గొంటూ ఇటీవల కెన్యాలోని నైరోబియాలో జరిగిన కౌంటీల్లో ఇంగ్లండ్ తరుపున పాల్గొని బెస్ట్ బౌలర్ ఆఫ్ ది టోర్నమెంట్‌గా నిలిచారు. అతని కుమారుడు హర్ష ఇంగ్లండ్ రంజీ జట్టు ప్లేయర్‌గా రాణిస్తున్నాడు. స్వగ్రామం వచ్చిన మోహన్‌బాబును పాఠశాలలో పూర్వ ఉపాధ్యాయులు, స్నేహితులు, గ్రామస్థులు సత్కరించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు సాంబశివరావు, ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బారావు, మాజీ సర్పంచ్ పర్వతనేని రాజరాజేశ్వరి, విశ్రాంత ఉపాధ్యా యులు ఎస్.బలరామయ్య, ఏడీవీప్రసాద్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా అండర్ -15 చెస్ పోటీలు

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి) : ఏలూరు శాంతినగర్ 13వ రోడ్డులో ని వి.పాల్ ఉడ్ గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఏలూరు జిల్లా స్థాయి అండర్-15 చెస్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. పోటీల్లో జి.అభిషేక్ అబ్రహం ప్రథమ, జి.అనురూప్ మోషే ద్వితీయ, పి.హర్షవర్దన్ తృతీయ, వి.కార్తికేయ 4వ స్థానంలో, పి.ఉదయ్‌కుమార్ 5వ స్థానం సాధించారు. పి.సాత్విక, కె.మమిత్‌కుమార్, నవనీత్, జశ్వంత్, ఎస్.కె పర్వాన్, ధరణి, ఎం.అశ్విన్, ఎం.బెన్నీ, మోక్షిత తదితరులు విజయం సాధించారు. ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్ మాధవ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అబ్రహం గ్యారీ కాస్‌ప్రొ అకాడమి ఆధ్వర్యంలో జరిగాయి. డైరెక్టర్ జి.యోహా నంద్, ఆర్బిటర్స్ జి.స్వరూపరాణి, యదిత్య తదితరులు పర్యవేక్షించారు.

వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వినోద్ కుమార్

ఏలూరు రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయ సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్‌కుమార్ ఎన్నికయ్యారు. ఆదివారం జిల్లా వ్యవసాయ సహాయకుల విస్తృత స్థాయి సమావేశం రాష్ట్ర వ్యవసాయ సహా యకుల సంఘం ఉపాధ్యక్షుడు తొర్లపాటి కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్ను కున్నారు. ప్రధాన కార్యదర్శిగా గుడిదల బాలార్జున్, ట్రెజరర్‌గా స్వర్ణలత, అడిషనల్ ప్రధాన కార్యదర్శిగా టి.రమేష్, ఉపాధ్యక్షుడిగా పంజా కాశీప్రసాద్, వర్కింగ్ అధ్యక్షుడిగా ఎం.రవిచం ద్ర, మహిళా అధ్యక్షురాలిగా డి.రేష్మా, జాయింట్ కార్యదర్శిగా శ్రీనివాసరావు, వి.రాజు, పవన్, సభ్యులుగా శివ నాగరాజు, టి.అజయ్‌కుమార్, రాణి, కోటేశ్వర రావు, అభినాష్, కె.వర్మలను ఎన్నుకున్నారు.



చిన్నారావుకు అభినందనలు తెలుపుతున్న కూటమి నాయకులు

కొండంగి ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌గా చిన్నారావు

కలిదిండి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కొండంగి ఎత్తిపోతల కమిటీ చైర్మన్‌గా వేగిరెడ్డి చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలిదిండిలో నిర్వహించిన కూటమి సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకాల ద్వారా చివరి ఎకరం వరకు సాగునీరు అందించటానికి కృషి చేస్తానన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సుబ్బరాజు, పెదలంక సొసైటీ అధ్యక్షులు బుస్సా వసంతరావు, డీసీ వైస్ చైర్మన్ నున్న కృష్ణబాబులు చిన్నారావుకు అభినందనలు తెలిపారు.



కైకలూరు, కలిదిండి, నూజివీడు పట్టణాల నుంచి హైందవ శంఖారావానికి తరలివెళుతున్న హిందువులు

హైందవ శంఖారావం

» కైకలూరు, నూజివీడు నియోజకవర్గాల నుంచి తరలి వెళ్లిన హిందువులు

నూజివీడు టౌన్ /చాట్రాయి/ ముసునూరు జనవరి 5 (ఆంధ్రజ్యోతి):గన్నవరంలో ఆదివారం జరిగిన హైందవ శంఖారావ మహాసభకు నూజివీడు నియోజకవర్గంలోని మండల, పట్టణ ప్రాంతాల్లోని పలు ప్రాంతాల నుంచి హిందువులు భారీగా తరలి వెళ్ళారు. దాదాపు 20 బస్సుల్లో హిందువులు మహాసభకు తరలివెళ్ళగా భారతీయ జనతాపార్టీ సీనియర్ నాయకులు వై.ఎస్ దొరై, గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు, ఎం.రాజశేఖర్, బోను అప్పారావు, శివరాజు వసుంధరాదేవి, నాగమణి, లాలయ్య తదితరులు పాల్గొన్నారు. చాట్రాయి మండలం నుంచి 13 బస్సులు, 25 ఆటోలు, 50 ద్విచక్ర వాహనాలలో సుమారు 1200 మంది హింధువులు శంఖారావం సభకు హాజరైనట్లు శీర్లం వేణుగోపాలరెడ్డి, ఇజ్జిగిరి కేశవ నరశింహారావు చెప్పారు. వివిధ హిందూ సంఘాల ప్రముఖులు అప్పారావు, మల్లికార్జునరావు, సంజీవరెడ్డి, ఓబిళ్ళనేని రాజా, నెక్కలపు వెంకటేశ్వరరావు, తుమ్మల జగన్, ఆదిమూలం శర్మ తదితరులు వెళ్ళారు. ముసునూరు మండలం నుంచి బీజేపీ సీనియర్ నాయకులు గుడివాడ వెంకటేశ్వరావు, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండలంలో నాలుగు బస్సులతో పాటు వివిధ వాహనాల్లో అధిక సంఖ్యలో సభకు వెళ్ళారు.

• కైకలూరు/కలిదిండి/మండవల్లి/ ముదినేపల్లి : కైకలూరు మండలం కైకలూరు పట్టణంలో ఆదివారం ఉదయం శ్రీశ్యామలాంబ అమ్మ వారి ఆలయ ప్రాంగణం నుంచి పెద్దఎత్తున ఆర్ఎస్ఎస్ సభ్యులు, హైందవ కుటుంబ సభ్యులు, స్వర్ణకార సంఘం తదితరులు వందలాది బస్సుల్లో తరలివెళ్లారు. ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ మేడిశెట్టి పాములు తదితరులు వెళ్లారు. కలిదిండి మండలం నుంచి బస్సులు, కారులు, బైకులపై ర్యాలీగా వేలాది మంది తరలివెళ్లారు. బీజేపీ నాయకులు, హిందూ మత ప్రచారకులు వాహనాల ర్యాలీని ప్రారంభించారు. బీజేపీ నాయకులు అంకాల దుర్గా ప్రసాద్, నంబూరి బాందు రాజు, కోకా శ్రీనివాసరావు, రమేష్, చిట్టూరి రవీంద్ర, అండ్రాజు దుర్గారావు, పెరుమాళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. మండవల్లి మండలం మండవల్లి, గన్నవరం, అయ్యవారిరుద్రవరం, అప్పాపురం, శోభనాద్రిపురం, పెరికేగూడెం, లింగాల, కానుకొల్లు, పుట్లచెరువు, ఉనికిలి, పులపర్రు, చింతపాడు, కొవ్వాడలంక, ఇంగిలిపాకలంక, పెనుమాకలంక గ్రామాల నుంచి వందలాది మంది తరలి వెళ్లారు. సుమారు 400మంది ప్రైవేటు బస్సులు, వాహనాల్లో, మోటారు సైకిళ్లపై సభకు బయలుదేరారు. ముదినేపల్లి మండలం నుంచి పలు వాహనాల్లో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, మండల శాఖ అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, నాయకులు వత్తుమిల్లి ప్రసాద్, రెడ్డి రాధిక, మీసాల సత్యనారాయణ, గునుకుల నారాయణ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు పుప్పాల శేషు, వడ్లాని ఆంజనేయులు, భుజంగ వెంకట నరసింహారావు, కరిమికొండ నాగబాబు ఆధ్వర్యంలో హిందువులు, అర్చకులు, హైందవ శంఖారావానికి వెళ్లారు.

రాష్ట్ర ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షుడిగా గుడివాడ గణేశ్

మండవల్లి జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్టీఐ విభాగం ఉపాధ్యక్షుడిగా మండవల్లికి చెందిన గుడివాడ గణేష్‌కుమార్‌ను నియమిస్తూ నియామక ఉత్తర్వులను రాష్ట్ర అధ్యక్షుడు అందజేశారు. ఆదివారం గుంటూరులో జరిగిన ప్రజా సంకల్ప వేదిక రాష్ట్ర నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం సందర్భంగా నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షుడు మదిరెరంగసాయిరెడ్డి అధ్యక్షతన రాష్ట్రంలోని 8 విభాగాల్లో రాష్ట్ర అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను నియమించారు. ఈ సందర్భంగా ఆర్టీఐ విభాగానికి సంబంధించి గుడివాడ గణేష్‌ను నియమిస్తూ నియామక పత్రాలను ఆయన అందజేశారు. అదేవిధంగా ఆయా శాఖలకు సంబంధించి కార్యవర్గ సభ్యులను నియమించి పత్రాలను అందజేశారు. వీరి పదవీ కాలం రెండు సంవత్సరాల పాటు కొనసాగుతుందని ఆయన ధ్రువీకరించారు.



ముసునూరులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం సభ్యులు

విద్యుత్ చార్జీలు తగ్గించాలి : సీపీఎం

ముసునూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలను ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని సీపీఎం మండల కార్యాదర్శి కొడవలి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు పెంపు, వ్యవసాయబోర్లకు స్మార్ట్ మీటర్లు బిగించడంపై నిరసనగా ముసునూరులో ఆదివారం కరపత్రాలను పంపిణీ చేశారు. కంచర్ల రమేష్, శివప్రసాద్, శ్రీను, దుర్గారావు, గంగుల సత్యం తదితరులు పాల్గొన్నారు.



పోలవరంలో విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వ్యాఖ్యలు తగవు

చాట్రాయి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో వేరే నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే అనుచరులు అక్రమ మైనింగ్ చేస్తున్నారంటూ గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు వ్యాఖ్యలు చేయడం ఆయన హోదాకు తగదని మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, నాయకులు యర్రా రాజబాబు, జయరాజు ఖండించారు. పోలవరంలో ఆదివారం వారు విలేఖరులతో మాట్లాడుతూ ఎవరో చెప్పిన తప్పుడు సమాచారాన్ని నమ్మి ఇలా మాట్లాడటం సమంజసం కాదన్నారు. మంత్రి పార్థసారథి దృష్టికి ఈ సమాచారాన్ని తీసుకువెళ్ళి నిర్ధారించుకొని మాట్లాడితే బాగుండేదని ఇలా రచ్చకెక్కడం ఆయన హోదాకు తగదని టీడీపీ నాయకులు అన్నారు.

యూటీఎఫ్ సభలకు తరలిన ఉపాధ్యాయులు

నూజివీడు టౌన్, జనవరి 5 (ఆంధ్ర జ్యోతి): యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ స్వర్ణోత్సవ సభలకు నూజివీడు మండలశాఖ నుంచి ఉపాధ్యాయులు తరలివెళ్ళారు. నూజివీడు యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఏలూరు సహ అధ్యక్షులు జి.వెంకటేశ్వరరావు, మండలాధ్యక్ష కార్యదర్శులు బొద్దుకోళ్ళ బాబురావు, మల్లెల చెన్నకేశవరావుల ఆధ్వర్యంలో కాకినాడలో ఆదివారం నుంచి 7వ తేదీవరకు నిర్వహించే మహాసభలకు ఉపా ధ్యాయులు తరలివెళ్ళారు. జిల్లా కార్యదర్శి బత్తుల అనురాధ తదితరులు పాల్గొన్నారు.



పీజేఎస్ మాల్యాద్రిని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ, టీడీపీ కన్వీనర్ వీరమల్లు

ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్‌గా మాల్యాద్రి ప్రమాణ స్వీకారం


కైకలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కైకలూరుకు చెందిన టీడీపీ నేత పీజేఎస్ మాల్యాద్రి ప్రమాణస్వీకారం చేశారు. ఆదివారం విజయవాడ-1టౌన్‌లోని గాంధీజీ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో జరిగిన కార్పొరేషన్ ప్రమాణ స్వీకారోత్సవాల్లో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా డూండి రాకేష్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కైకలూరులో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, టీడీపీ నేతలు పోలవరపు లక్ష్మీరాణి, రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, పి.రాధాకృష్ణ, ఈదా వెంకటస్వామి, ఎండీ జాని, వీరాబత్తిన సుధా, సయ్యద్ బాషీద్, ఎండీ ఉస్మాన్, తదితరులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్పొరేషన్ ద్వారా పేద ఆర్యవైశ్యుల అభివృద్ధికి మాల్యాద్రి కృషి చేయాలని నేతలు కోరారు. కార్లలో ర్యాలీగా ఆయన ప్రమాణస్వీకారానికి తరలివెళ్లారు.

నేటి నుంచి విద్యుత్ సరఫరా నిలుపుదల

కైకలూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడలోని 220 కేవీ ఉపకేంద్రంలో సాంకేతిక మరమ్మతుల నిమిత్తం సోమవారం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ ఎస్. కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఉదయం తొమ్మిది నుంచి 8వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు మరమ్మతులు నిర్వహిస్తామన్నారు. ఈ నేపథ్యంలో గుడివాడ నుంచి విద్యుత్ సరఫరా అవుతున్నందున కైకలూరు నియోజకవర్గంలోని ముదినేపల్లి మండలం చిగురుకోట విద్యుత్ సబ్‌స్టేషన్‌కు అంతరాయం కలగవచ్చన్నారు. మరమ్మతులు నిర్వహించే సమయంలో అవసరాన్ని బట్టి ఆయా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకుని సహకరించాలన్నారు.

డేంజర్ గురూ..!

చాట్రాయి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విస్సన్నపేట-చింతలపూడి ఆర్‌అండ్‌బీ రహదారిలో పోలవరం టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ వద్ద రోడ్డు అంచున ఉన్న నిరుపయోగ ప్రమాదకర బావిని పూడ్చించాలని వాహన చోదకులు ప్రజలు కోరుతున్నారు. ఇది ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాలను కలిపే రహదారి కావడంతో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. జంగారెడ్డిగూడెం ప్రాంతంలో నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ఈ రోడ్డులోనే 50, 60 టన్నుల లారీలు నిత్యం పెద్ద సంఖ్యలో నడుస్తున్నాయి. వాహనాల తాకిడికి రోడ్డు బావి వైపు కుంగిపోతున్నది. చెరువుకు దగ్గర ఉండటంతో ఈ బావిలో ఎప్పుడు నిండుగా నీరు ఉంటుంది. రోడ్డు టర్నింగ్‌లో ఈ బావి ఉండటం, బావి చుట్టూ చెట్లు పెరిగి ఉండటం వలన ఇక్కడ ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. ఎటువంటి ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పోలవరంలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న బావి ఇదే..


చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో నిధులు స్వాహా ?



వివరాలు వెల్లడిస్తున్న భవిత గ్రామైక్య సంఘం అరుణోదయ గ్రూప్ సభ్యులు

నూజివీడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం తీసుకు వచ్చిన వెలుగు ప్రాజెక్టు అక్రమార్కులకు ఆర్థికవనరుగా మారుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నూజివీడు నియోజకవర్గపరిధిలోని ముసునూరు మండలం చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో మహిళల నిరక్షరాశ్యతను ఆసరాగా తీసుకుని ఓ బుక్ కీపర్ సంవత్సరాల తరబడి అదనంగా నిధులు కట్టించుకుంటూ వాటిని స్వాహా చేసినట్టు చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘం పరిధిలోని అరుణోదయ మహిళా సంఘం సభ్యులు వాపోతున్నారు.గ్రామైక్యసంఘం అధ్యక్షురాలిగా ఉన్న శిరీష మాట్లాడుతూ బుక్‌కీపర్ తనవద్ద ఉన్న చెక్కులపై సంతకం చేయించుకుని తనకు తెలియకుండా నిధులను డ్రా చేసుకోవడంతో పాటు లెక్కలు, సంఘ సభ్యత్వాలు, ఇతర వివరాలు అడిగినా కనీస సమాచారం కూడా ఇవ్వడం లేదని వాపోతున్నది. వెలుగు ప్రాజెక్టులో ప్రతి సంవత్సరం నిర్వహించే ఆడిట్‌కు సంబంధించిన సమాచారం సైతం ఇవ్వడం లేదని దీనిపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా జిల్లా అధికారుల సూచనలతో వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా విచారణ నిర్వహించి చేతులు దులుపుకున్నారని మహిళా సంఘాల సభ్యులు వాపోతున్నారు. ఒక్క అరుణోదయ గ్రామైక్య సంఘం లోనే దాదాపు రూ.7లక్షల నిధులు స్వాహా అయ్యి ఉంటాయని మహిళలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. రెండున్నర సంవత్సరాల్లో చెల్లించాల్సిన మహిళా సంఘ రుణాలను ఐదు సంవత్సరాలు పూర్తయినా ఇంకా రుణం పూర్తికాలేదని, తమ దగ్గర డబ్బులు వసూలు చేస్తోందని వీటికి సంబంధించిన రికార్డులు బుక్‌కీపర్ చూపకపోవడంపై అనేక అనుమానాలు ఉన్నాయని విచారణ నిర్వహించాలని సభ్యులు కోరుతున్నారు. మొత్తం 42 గ్రూపుల్లో లక్షల్లో నిధులు స్వాహా అయి ఉంటాయని విచారణ చేయాలని వెలుగు ప్రాజెక్టు పరిధిలోని మహిళాసంఘాల సభ్యులు దేవమణి, డి.మరియమ్మ, బి.అవ్వమ్మ, దాసరి మేరి, కె.కోమల, మార్తమ్మ, డి.ప్రమీల తదితరులు కోరుతున్నారు.

అక్రమ మైనింగ్ చేస్తున్న వారు ఎవరో బయట పెట్టండి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు


నూజివీడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గంలో అక్రమ క్వారీయింగ్‌కు గన్నవరం మాజీ ఎమ్మెల్యే అనుచరులు పాల్పడుతున్నారంటూ గన్నవరం శాసనసభ్యుడు యార్లగడ్డ వెంకట్రావు చేసిన వ్యాఖ్యలు నూజివీడు నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశమైంది. దీనిపై నూజివీడులో తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దె రఘుబాబు మాట్లాడుతూ నియోజకవర్గంలో అక్రమమైనింగ్‌కు పాల్పడుతున్నవారు ఎవరో గౌరవ గన్నవరం శాసనసభ్యులు బయట పెట్టాలని, తద్వారా పూర్తి అవగాహనతో చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వెంకట్రావు మీడియాతో మాట్లాడుతూ మాజీ శాసనసభ్యుని అనుచరులు కొందరు టీడీపీలో చేరి నూజివీడు నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని చేసిన వ్యాఖ్యలను వీరు ఖండించారు. సమావేశంలో తెలుగు యువత నాయకులు గోగినేని మధు, తుమ్మల ఆది, పొట్లూరి నాని తదితరులు పాల్గొన్నారు.



చిల్లబోయినపల్లిలో బెల్లపు ఊట ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

సారా బట్టీలపై దాడులు.. 800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

ముసునూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో సారా బట్టీలపై ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ ఎ.మస్తానయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. చిల్లబోయినపల్లిలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 800 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశారు. అక్కడ నుంచి అనగాని చంద్రరావు అనే వ్యక్తి పారి పోయాడని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ భోగేశ్వరరావు, సబ్ ఇన్‌స్పెక్టర్ ఆరిఫ్, నూజివీడు సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణా జిల్లా యూనివర్శిటీ జట్టుతో పీజీ కళాశాల ప్రిన్సిపాల్ నవీనా లావణ్యలత

అఖిలభారత నెట్‌బాల్ టోర్నీకి కృష్ణా వర్సిటీ జట్టు

నూజివీడు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత నెట్‌బాల్ టోర్నీకి కృష్ణా యూనివర్సిటీ జట్టు ఎంపిక ప్రక్రియను ఆదివారం నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజ్‌ఫర్ పీజీ స్టడీస్‌లో నిర్వహించారు. జైపూర్‌లోని సురేష్ జ్ఞానవిహార్ యూనివర్శిటీలో ఈనెల 7 నుంచి 9 వరకు అంతర్ విశ్వవిద్యాలయాల నెట్‌బాల్ మహిళా టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టును ప్రిన్సిపాల్ లావణ్య ప్రకటించారు.